మారో ప్రజా సంకల్పం
Maro Praja Sankalpam • Main Edition

హామీల ఎగవేత..
డైవర్షన్ ఎత్తుగడ

చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయ్యింది. తాను అధికారంలోకి వస్తే ప్రజలకు సంపద పంచుతానన్నారు. కానీ, ఈ రెండున్నరేళ్ల కాలంలో ఆయన ప్రజలకు, రాష్ట్రానికి అబద్ధాలు, మోసాలు, వెన్నుపోట్లు, స్కాములు, జంగిల్ రాజ్ అరాచకాలు తప్ప... ఇంకేం పంచలేదు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు అటకెక్కించారు. చంద్రబాబు ఏ జిల్లాలో ఏ మీటింగ్ చూసినా మీకు ఆత్మస్తుతి, పరనింద ఈ రెండే కనిపిస్తాయి. పిట్టకథలు, కట్టుకథలు, తప్పుడు మాటలు, అబద్ధాలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద నిందలు, తప్పుడు ఆరోపణలు ఇవి మాత్రమే కనిపిస్తాయి. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా డీఎస్సీ పరీక్షలు లేకుండానే టీచర్ పోస్టులు ఇచ్చారు. తప్పుడు సర్టిఫికెట్లతో పోస్టులు అమ్ముకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠాలు చెప్పన్న ఉపాధ్యాయుల గౌరవానికి మచ్చ తెచ్చారు. ఈ స్కాం ఎలా జరిగిందో, టీచర్ పోస్టులను ఎలా అమ్ముకున్నారో, సాక్ష్యాలు, ఆధారాలు బయటపడ్డాయి. లోకేష్ రాజీనామా చేయలేదు, సీబీఐ ఎంక్వైరీ వేయలేదు. అధికారంలోకి వస్తే ఉద్యోగులను గొప్పగా చూసుకుంటానంటూ హామీ ఇచ్చి, ఇవాళ ప్రతి ప్రభుత్వ ఉద్యోగినీ రోడ్డుమీదకు లాగుతున్నారు. మేనిఫెస్టోలో పెట్టినట్టుగా పీఆర్సీ లేదు, ఐ.ఆర్. లేదు. మొన్నటివరకూ డీఏల కోసం ఉద్యోగులు ఆందోళన మార్గం పట్టారు. చివరకు రెండు డీఏలు ఇస్తానని మెలిక పెట్టారు. ఈ రెండున్నరేళ్లుగా చంద్రబాబు రెండు సీరియల్స్ నడుపుతున్నారు. ఒకటి వివేకానందరెడ్డి కేసు, రెండోది అక్రమ లిక్కర్ కేసు. ఈ రెండు సీరియళ్లను తాను ఎక్కడ కావాలంటే అక్కడ ప్రదర్శిస్తున్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు మొదలుపెడతారు. ఎప్పుడైనా ఈ రెండు సీరియల్స్ సశేషమే. ఈ కేసులను 2029 ఎన్నికల దాకా ప్రచారం చేసుకోవడం, రాజకీయ లబ్ధి పొందేందుకు మాత్రమే ఉపయోగించుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.